గ్రామ వార్డు సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ చంద్రశేఖర్ 3

Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com



# రిపోర్టర్లు కావలెను

నేటి వెలుగు తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు
రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో
మరియు మండల హెడ్ క్వార్టర్స్ లో రిపోర్టర్లు కావాలి
ఆసక్తి గలవారు ఈ నెంబర్కు సంప్రదించండి:-
సంపాదకులు పామనగుండ్ల నవీన్ కుమార్ గౌడ్
9553276552.



నల్గొండ | సంపుటి : 2 | సంచిక : 365 | ఏప్రిల్ 1 బుధవారం 2026 | పేజీలు : 4 | వెల రూ. 1.00/-

NALGONDA | VOL:2 | ISSUE: 365 | PAGES:4 | WEDNESDAY APRIL 1 2026 | Rs. 1:00


# ఆర్టీసీని కనుమరుగు చేసే కుట్ర: సీఎం రేవంత్‌రెడ్డిపై థామస్ రెడ్డి ధ్వజం

**ఆర్టీసీని ప్రైవేటీకరించేందుకు రేవంత్ పావులు కదుపుతున్నారన్న థామస్ రెడ్డి**

**ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులు అనుమతించవద్దని డిమాండ్**

**ఈవీ బస్సుల నిర్వహణను పూర్తిగా**



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ)ను ప్రైవేటీకరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పావులు కదుపుతున్నారని ఆర్టీసీ జేఏసీ వైస్ చైర్మన్ థామస్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఆర్టీసీ డిపోల్లో ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను అనుమతించవద్దని, సంస్థ భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ నిన్న రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు ఆందోళనలు చేపట్టారు. కరీంనగర్ డిపో-2 ఎదుట జరిగిన 'అర్ధనగ్న ప్రదర్శన'లో పాల్గొన్న థామస్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని శాఖలకు నిధులు కేటాయించిన ప్రభుత్వం, ఆర్టీసీని మాత్రం విస్మరించిందని థామస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీకి రావాల్సిన రూ. 7,500 కోట్ల బకాయిలకు

(మిగతా 2వ పేజీలో..)


## కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారు: ప్రధాని మోదీ ఫైర్



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన, భౌగోళిక రాజకీయ సవాళ్లు నెలకొన్నప్పటికీ, భారతదేశం స్థిరంగా ఉందని స్పష్టం చేశారు. మంగళవారం గుజరాత్‌లోని వావ్-థరాడ్‌లో రూ.19,800 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ఐక్యతను దెబ్బతీస్తూ, కాంగ్రెస్ వదంతులను ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారని మండిపడ్డారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోందని మోదీ అన్నారు. "ప్రపంచంలోని ఎన్నో దేశాలు అస్థిరతను ఎదుర్కొంటున్నాయి. డీజిల్, పెట్రోల్, గ్యాస్ సమస్యలతో సతమతమవుతున్నాయి. అయితే, మన విజయవంతమైన విదేశాంగ విధానం, ప్రజల ఐక్యత వల్ల భారత్

(మిగతా 2వ పేజీలో..)

## అమెరికా సాయం చేయదు.. మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి: మిత్రదేశాలపై ట్రంప్ ఫైర్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రదేశాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్‌పై సైనిక చర్యలో అమెరికాకు సహకరించని దేశాలు, తమకు కావాల్సిన చమురును తామే తెచ్చుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ పెట్టారు."ఇరాన్‌ను దెబ్బతీసే చర్యల్లో పాల్గొనడానికి నిరాకరించిన యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలకు నాదొక సూచన. మీకు రెండు మార్గాలున్నాయి. ఒకటి, మా దగ్గర పుష్కలంగా

(మిగతా 2వ పేజీలో..)

## రేవంత్ రెడ్డి అసెంబ్లీలో 'పహిల్వాన్' భాష మాట్లాడుతున్నారు: హరీశ్ రావు ఆగ్రహం



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలసీలను గాలికి వదిలేసి, పహిల్వాన్ల భాషను మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. అసెంబ్లీలో పాలసీలు ఉంటాయి కానీ పహిల్వాలు, కుస్తీ పోటీలు ఉండవని ఎద్దేవా చేశారు. అసెంబ్లీని కుస్తీల పోటీగా మార్చారని మండిపడ్డారు. కత్తులతో కోలాటంలో తలలు తీసేస్తామని మరో ఎమ్మెల్యే వ్యాఖ్యానించారని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని కోరారు.గడిచిన రెండున్నర సంవత్సరాలలో రేవంత్ రెడ్డి సభలో మాట్లాడిన ఎన్నో అనాగరిక వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వం వైఫల్యాలను

(మిగతా 2వ పేజీలో..)

## కేరళలో లెఫ్ట్ కూటమి గెలుపొందాలని మోదీ కోరుకుంటున్నారు: రాహుల్ గాంధీ



కేరళలో లెఫ్ట్ కూటమి గెలుపొందాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సీపీఐ(ఎం) వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్ వింగ్ పార్టీ అని విమర్శించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా లెఫ్ట్ పార్టీ నేతలు బీజేపీతో జతకట్టారని అన్నారు. అందుకే కేరళలో ఎల్డీఎఫ్ గెలుపొందాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. కన్నూరులో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, మోదీ ప్రతిచోట మతం, దేవుడి గురించి మాట్లాడుతారని, కానీ కేరళలో మాత్రం కనీసం శబరిమల బంగారం

(మిగతా 2వ పేజీలో..)

## కాగ్ గణాంకాలను ప్రస్తావిస్తూ.. రేవంత్ ప్రభుత్వంపై కవిత ఫైర్

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని, రోజువారీ ఖర్చుల కోసం కూడా ప్రభుత్వం ఆర్బీఐ ముందు చేయి చాచాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి


(మిగతా 2వ పేజీలో..)



# ఏపీలో చేనేతలకు 'పవర్' గిఫ్ట్...

ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక కానుక అందించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ పథకం ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానుంది. దీని కింద చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు (మరమగ్గాలకు) 500 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేయనున్నారు. విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించి, సంక్షోభంలో ఉన్న చేనేత వృత్తికి అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,04,488 చేనేత కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. వీరిలో సుమారు 93,000 చేనేత మగ్గాల కుటుంబాలు, 11,488 పవర్‌లూమ్ కుటుంబాలు ఉన్నాయి. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం ఏటా సుమారు

(మిగతా 2వ పేజీలో..)



## ఇది లక్షద్వీప్ కాదు... వైజాగ్!: ఆసక్తికర వీడియో పంచుకున్న మంత్రి నారా లోకేశ్

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ అభివృద్ధిపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికరమైన ప్రచార వీడియోను ఆయన పంచుకున్నారు. రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త ఊపు తెచ్చే ఈ వీడియో ఇప్పుడు నెటిజన్లను విశేషంగా

(మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

# కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారు: ప్రధాని మోదీ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

ఈ పరిస్థితులను అదుపులో ఉంచగలిగింది” అని ఆయన వివరించారు. చిన్న దేశాల నుంచి అగ్రరాజ్యాల వరకు ఇంధన ధరలు 10 నుంచి 25 శాతం పెరిగాయని, కానీ భారత్ మాత్రం ఆ భారాన్ని ప్రజలపై పడనీయడం లేదని తెలిపారు. ఈ వాస్తవాలను కాంగ్రెస్ చూడలేకపోతోందని మోదీ విమర్శించారు. “దేశానికి ఐక్యత అవసరమైన ఈ సమయంలో కొందరు రాజకీయాలు చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ ముందుంది. ధైర్యం చెప్పాల్సిన చోట భయాన్ని, వదంతులను వ్యాపింపజేస్తున్నారు. రాజకీయ రాబందుల్లా దేశంలో గందరగోళం కోసం ఎదురుచూస్తూ, ఎన్నికల లబ్ధి పొందాలని చూస్తున్నారు” అని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ఇంధన ధరల విషయంలోనూ ప్రజలను క్యూలలో నిలబెట్టి లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించడంపై మోదీ సంతోషం వ్యక్తం చేశారు. “ఈ ఎయిర్‌బేస్ అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం 130 కిలోమీటర్ల దూరంలో ఉంది. దేశ భద్రతకు ఇది చాలా కీలకం” అని ఆయన పేర్కొన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుకు భూసేకరణ జరిగిందని గుర్తుచేశారు. “అప్పుడు ఢిల్లీలో అధికారంలో ఉన్నవారికి గుజరాత్‌పై ఎందుకో ద్వేషం. ఏళ్ల తరబడి ఫైళ్లను తొక్కిపెట్టి ప్రాజెక్టును అడ్డుకున్నారు. మీరు నన్ను ఢిల్లీకి పంపిన తర్వాత ఆ ఫైళ్లను బయటకు తీసి, ఈ ఎయిర్‌బేస్‌ను పూర్తి చేశాను” అని మోదీ తెలిపారు. ఈ ఆలస్యానికి కాంగ్రెస్ వైఖరే కారణమని, దేశ భద్రత విషయంలో వారి ప్రవర్తనను జాతి ఎప్పటికీ క్షమించదని అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో ప్రపంచ దేశాలు భారత్‌ను ప్రశంసిస్తుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం దేశ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూశారని మోదీ ఆరోపించారు. భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడే శక్తుల మాదిరిగా కాంగ్రెస్ మాట్లాడుతోందని విమర్శించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో చూపిన ఐక్యతను ఇప్పుడు కూడా ప్రదర్శించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఉత్తర గుజరాత్ అభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, దేశీయ, అంతర్జాతీయ సవాళ్లను భారత్ ఎలా ఎదుర్కొంటుందో చెప్పడానికి నిదర్శనమని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ‘పహిల్వాన్’ భాష మాట్లాడుతున్నారు: హరీశ్ రావు ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. అసెంబ్లీని కూడా ఈ ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు నడుపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీ బ్రేక్ పేరుతో, రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళుతున్నారని, ముఖ్యమంత్రి కేరళ నుంచి వస్తున్నారని, ఆర్థిక మంత్రి ప్రిపేర్ అవుతున్నారని, లంచ్ బ్రేక్ అంటూ ఇలా వివిధ కారణాలతో సభను గంటల పాటు వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృధా చేశారని మండిపడ్డారు. కావాలని సభను రాత్రి వరకు నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ ఎన్నికల కోసం శాసనసభను 30వ తేదీనే నిరవధిక వాయిదా వేశారని ఆరోపించారు. కేరళ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అవసరమేమో కానీ తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ శాసనసభ్యులకు ప్రజా సమస్యలు ముఖ్యమని అన్నారు.

**రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు తేడా లేదు**

కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు పెద్దగా తేడా లేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయని అన్నారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లాంటి వారు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారని గుర్తు చేశారు. ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పిందని వెల్లడించారు. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టారని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వస్తున్నాయని తెలిపారు. సీఆర్ పాటిల్ తెలంగాణకు వచ్చి ఇక్కడ రైతులను నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని అడిగితే సమాధానం వస్తుందని అన్నారు. కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో రూ.50 కోట్లు ఖర్చు చేస్తే మరో 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని రెండేళ్ల నుంచి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించడం లేదని ఆరోపించారు. మా మీద కోపం ఉంటే తీర్చుకోవచ్చు... కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపించవద్దని కోరారు.

# ఏపీలో చేనేతలకు ‘పవర్’ గిఫ్ట్...

(మొదటి పేజీ తరువాయి)

రూ.150 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ రాయితీ ద్వారా ప్రతి చేనేత కార్మికుడి కుటుంబానికి ఏడాదికి రూ.8,640 ఆదా కానుండగా, ఒక్కో పవర్‌లూమ్ యూనిట్‌కు ఏటా రూ.21,600 వరకు ఆర్థిక వెసులుబాటు లభిస్తుంది. ముడిసరుకు, రంగుల అద్దకం, నేత పనులకు విద్యుత్ అత్యవసరం కావడంతో, ఈ ఉచిత సరఫరా వారి ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించనుంది. ఉచిత విద్యుత్ పథకంతో పాటు, చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం మరిన్ని కీలక చర్యలు చేపట్టింది. అధికారంలోకి వచ్చిన వెంటనే నేతన్నలకు ఇచ్చే పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచింది. దీంతో పాటు రూ.5 కోట్ల విలువైన త్రిఫ్ట్ ఫండ్ నిధులను సహకార సంఘాలకు విడుదల చేసింది. ఆధునిక యంత్రాల కొనుగోలుపై 90 శాతం రాయితీ, ముడిసరుకులపై 15 శాతం సబ్సిడీ వంటి ప్రోత్సాహకాలను అందిస్తోంది. చిన్న తరహా క్లస్టర్ల అభివృద్ధికి రూ.10.44 కోట్లు కేటాయించింది. అంతేకాకుండా, చేనేత ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేర్చేందుకు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ వేదికలతో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తోంది. తాజాగా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయడం ద్వారా చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది.

# ఇది లక్షద్వీప్ కాదు... వైజాగ్!: ఆసక్తికర వీడియో పంచుకున్న మంత్రి నారా లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

ఆకట్టుకుంటోంది. ఈ ప్రచార వీడియోలో ఏపీలోని పలు సుందర ప్రదేశాలను దేశంలోని ఇతర ప్రముఖ పర్యాటక కేంద్రాలతో పోల్చి చూపించారు. “ఇది లక్షద్వీప్ కాదు వైజాగ్... సిక్కిం కాదు కైలాసగిరి... సుందర్ బన్స్ కాదు కోరింగ... తమిళనాడు కాదు సింహాచలం... గోవాలోని బాగా బీచ్ కాదు రుషికొండ బీచ్... ఇది కేరళ కాదు కోనసీమ... ఇది ఆంధ్రప్రదేశ్” అంటూ సాగే ఈ వీడియో రాష్ట్రంలోని ప్రకృతి రమణీయతను కళ్లకు కడుతోంది. ఈ వీడియోతో పాటు లోకేశ్ ఒక సందేశాన్ని కూడా పోస్ట్ చేశారు. “పవిత్ర ఆలయాల్లోని మంత్రోచ్చారణల నుంచి అంతులేని సముద్ర తీరం వరకు, కాలుష్యానికి దూరంగా ఉన్న కొండల అందాల వరకు ఆంధ్రప్రదేశ్ ఆత్మకు ఓ గొప్ప ప్రయాణం లాంటిది. ఇక్కడ ప్రకృతి, ఆధ్యాత్మికత, అవకాశాలు అన్నీ ఒకేచోట సంగమిస్తాయి. రండి, ఆంధ్రప్రదేశ్ మ్యాజిక్‌ను అనుభూతి చెందండి” అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.



# ఆర్టీసీని కనుమరుగు చేసే కుట్ర: సీఎం రేవంత్‌రెడ్డిపై థామస్ రెడ్డి ధ్వజం

(మొదటి పేజీ తరువాయి)

గాను కేవలం రూ. 4 వేల కోట్లే కేటాయించడం దారుణమన్నారు. సంస్థకు నిధులు రాబట్టడంలో విఫలమైన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర నిధులతో కొనుగోలు చేసిన ఎలక్ట్రా, జేబీఎం కంపెనీల ఈవీ బస్సులను ఆర్టీసీకి అప్పగించి, లాభాలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని థామస్ రెడ్డి విమర్శించారు. ఈవీ బస్సుల నిర్వహణను పూర్తిగా ఆర్టీసీ యాజమాన్యానికే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ స్థలాల్లో కేవలం ఆర్టీసీ బస్సులే ఉండాలని, ప్రైవేట్ సంస్థల ప్రమేయం ఉండకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని, యూనియన్లకు గుర్తింపునిస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయని థామస్ రెడ్డి నిలదీశారు. అధికారంలోకి వచ్చాక కేంద్రం చెప్పినట్లు ప్రైవేటీకరణ నిర్ణయాలను అమలు చేయడానికి సీఎం మధ్యవర్తిత్వం వహిస్తున్నారని ధ్వజమెత్తారు.

# అమెరికా సాయం చేయదు.. మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి: మిత్రదేశాలపై ట్రంప్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న చమురును కొనుగోలు చేయండి. రెండు, కాస్త ధైర్యం తెచ్చుకుని హర్మూజ్ జలసంధికి వెళ్లి, మీకు కావాల్సిన చమురును మీరే తెచ్చుకోండి” అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేగాక మిత్రదేశాలు ఇకపై తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. “అమెరికా మీకు సాయం చేయడానికి రాదు. మాకు అవసరమైనప్పుడు మీరు ఎలాగైతే దూరంగా ఉన్నారో, మేమూ అలాగే ఉంటాం. ఇరాన్‌ను మేము ఇప్పటికే దెబ్బతీశాం. కష్టమైన పని పూర్తయింది. ఇక వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి” అని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి నెల రోజులు దాటినా, ఇరాన్ ఇప్పటికీ హర్మూజ్ జలసంధిపై తన పట్టును కొనసాగిస్తోంది. ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణా ఈ జలసంధి గుండానే జరుగుతుంది. ఇరాన్ దిగ్బంధనం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇది ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుదిపేయడంతో పాటు అనేక నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమైంది.

# కేరళలో లెఫ్ట్ కూటమి గెలుపొందాలని మోదీ కోరుకుంటున్నారు: రాహుల్ గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

చోరీపై కూడా మాట్లాడటం లేదని మండిపడ్డారు. బంగారు తాపడాలు మాయం కావడం వెనుక సీపీఐ నేతల హస్తం ఉందని ఆరోపించారు. సీపీఐతో జతకట్టడం వల్లే బీజేపీ నాయకులు శబరిమల అంశంపై మాట్లాడటం లేదని అన్నారు. బీజేపీతో జతకట్టడం సీపీఐలోని కొంతమంది నాయకులకు ఇష్టం లేదని, అందుకే వారు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్రులుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని అన్నారు. శబరిమల ఆలయంలో బంగారం చోరీకి సంబంధించి సీపీఐ(ఎం) నాయకులపై బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, ఇక్కడి ఎల్డీఎఫ్ మధ్య ఒక అవగాహన ఉందని ఆరోపించారు. కేరళ ముఖ్యమంత్రిని నరేంద్రమోదీ నియంత్రిస్తున్నారని వ్యాఖ్యానించారు. కేరళ ముఖ్యమంత్రిని జైల్లో పెట్టగలిగే తాళం చెవి మోదీ వద్ద ఉందని, కానీ ఆయన చర్యలు మాత్రం తీసుకోరని అన్నారు.

# కాగ్ గణాంకాలను ప్రస్తావిస్తూ.. రేవంత్ ప్రభుత్వంపై కవిత ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి కాగ్ వెల్లడించిన గణాంకాలను ప్రస్తావిస్తూ ఆమె సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ పోస్ట్‌ను పెట్టారు. కాగ్ నివేదిక ప్రకారం... గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఏడాది మొత్తం మీద కేవలం రెండు రోజులు తప్ప, మిగిలిన 363 రోజులు ప్రభుత్వం ఆర్బీఐ నుండి వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ఓవర్ డ్రాఫ్టుల పేరుతో నిధులు సేకరించిందని కవిత పేర్కొన్నారు. “సుమారు రూ. 1.30 లక్షల కోట్లు తెచ్చి సర్కారును నెట్టుకొచ్చారు. 2025 మార్చి 31 నాటికి సుమారు రూ. 6 వేల కోట్లు తిరిగి చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది” అని ఆమె ఆరోపించారు. రాష్ట్రానికి నెలకు రూ. 12 వేల కోట్ల సొంత ఆదాయం ఉన్నప్పటికీ, రోజువారీ ఖర్చులకు కనీసం రూ. 1.38 కోట్ల బ్యాలెన్స్ కూడా మెయింటైన్ చేయలేకపోతున్నారని కవిత విమర్శించారు. రాష్ట్రంపై మొత్తం రూ. 8.65 లక్షల కోట్ల అప్పులు మోపి, ప్రతి కుటుంబంపై సగటున రూ. 9 లక్షల భారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వేసిందని ధ్వజమెత్తారు. అప్పులు తెస్తూ ఇంకా మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రమని చెప్పడం ప్రజలను వంచించడమేనని ఆమె మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ‘సంపద పెంచుతాం.. పేదలకు పంచుతాం’ అని కాంగ్రెస్ నేతలు చెప్పిన మాటలు వట్టి డొల్ల అని కాగ్ నివేదికతో తేలిపోయిందని కవిత ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి, తెలంగాణను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానిదేనని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగ్ నివేదిక సాక్షిగా ప్రభుత్వ వైఫల్యం బట్టబయలైందని ఆమె స్పష్టం చేశారు.



# హనుమాన్ శోభా యాత్రను శాంతియుతంగా నిర్వహించుటలో నిర్వాహకులు మరియు ప్రజలకు సూచనలు

### నిర్వాహకుల మరియు ప్రభుత్వ అధికారులతో సమన్వయ సమావేశం


**నల్గొండ మార్చి 31 నేటి వెలుగు ప్రతినిధి**

రాబోవు హనుమాన్ జయంతి పురస్కరించుకొని నల్గొండ పట్టణంలో నిర్వహించబోయే శోభా యాత్ర ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని నల్గొండ ఆర్డిఓ అశోక్ రెడ్డి మరియు డిఎస్పీ శివరాం రెడ్డి కోఆర్డినేషన్ మీటింగ్లో కోరారు. ఈ యాత్ర విజయవంతం కావడానికి పోలీస్ శాఖ, ఇతర ప్రభుత్వ విభాగాలు మరియు శోభా యాత్ర నిర్వాహక కమిటీల మధ్య సమన్వయం అత్యవసరమని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా, శోభా యాత్ర నిర్వహించే కమిటీలు తప్పనిసరిగా రూట్ మ్యాప్, సమయం మరియు పాల్గొనే వాహనాల వివరాలతో పోలీస్ శాఖ నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలి.నిర్ణయించిన మార్గంలోనే యాత్ర సాగాలి. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా కేటాయించిన సమయానికే యాత్రను ప్రారంభించి, ముగించాలి. ప్రతి కమిటీ కనీసం 20 నుండి 50 మంది వాలంటీర్లను నియమించుకోవాలి. వీరు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ క్రమశిక్షణను పర్యవేక్షించాలి. వాలంటీర్లు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు లేదా ప్రత్యేక బ్యాడ్జీలు ధరించాలి. గౌరవ కోర్టు ఉత్తర్వుల ప్రకారం నిర్ణీత డెసిబుల్స్ లోపు మాత్రమే సౌండ్ సిస్టమ్స్ వాడాలి. అశ్లీలమైన లేదా రెచ్చగొట్టే పాటలు ప్లే చేయరాదు. ఇతర మతాలను లేదా వర్గాలను కించపరిచేలా నినాదాలు చేయడం, బ్యానర్లు కట్టడం నిషిద్ధం. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దు మరియు తప్పుడు సమాచారాన్ని షేర్ చేయవద్దు. ఏవైనా అనుమానాస్పద అంశాలు ఉంటే వెంటనే 100 కి లేదా స్థానిక పోలీస్




స్టేషన్కు సమాచారం అందించాలి.విద్యుత్ శాఖ (ట్రాన్స్‌కో), మున్సిపల్ మరియు ఆరోగ్య శాఖ అధికారులతో ఇప్పటికే సమన్వయ సమావేశాలు నిర్వహించడం జరిగింది. విద్యుత్ తీగలు తగలకుండా, త్రాగునీటి సౌకర్యం మరియు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాము."నల్గొండ పట్టణ గౌరవాన్ని కాపాడుతూ, మతసామరస్యంతో ఈ పండుగను జరుపుకోవాలని కోరుతున్నాము. చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. నిర్వాహకులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలి." అని డిఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సిఐ రాఘవరావు ఎస్ఐ సైదులు నిర్వాహకులు ఎలిజాల నరసింహ, ప్రకాష్ రెడ్డి మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# గ్రామ వార్డు సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ చంద్రశేఖర్






**నల్గొండ జిల్లా మార్చి 31 నేటి వెలుగు ప్రతినిధి**

ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 న నిర్వహించే గ్రామ,మున్సిపల్ వార్డు సభలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.గ్రామ, మున్సిపల్ వార్డు సభల నిర్వహణ విషయమై మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులు ,మండల స్థాయి అధికారులతో ఇదే విషయమై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం గ్రామ, మున్సిపల్ వార్డు సభలు నిర్వహించాలని, ఈ గ్రామ,వార్డు సభలకు స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, పార్లమెంట్ సభ్యులు, తదితరులు అందర్నీ ఆహ్వానించాలన్నారు. గ్రామ సభలో వివిధ పథకాల కింద లబ్ధి పొందిన లబ్ధిదారుల పేర్లన్నీ చదివి వినిపించాలని చెప్పారు. గ్రామసభకు హాజరయ్యే వారి కి అవసరమైన టెంటు, తాగునీరు వంటివి ఏర్పాటు చేయాలని, ఆయా పథకాల కింద లబ్ధిదారులను గుర్తించి వారి ద్వారా వారు పొందిన లబ్ధిపై మాట్లాడించాలన్నారు. గ్రామసభల నిర్వహణ వివరాలన్ని రిపోర్టు రూపంలో డాక్యుమెంటేషన్ చేసి పంపించాలని తెలిపారు. గ్రామసభ సక్రమ నిర్వహణకు గాను ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, గ్రామ సభకు సంబంధించి గ్రామ అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని అన్నారు. గ్రామ సభలలో భాగంగా ఆయా పథకాల కింద లబ్ధిదారులకు లబ్ధిని కల్పించే పత్రాల పంపిణీ ఏర్పాటు చేసుకోవాలని, గ్రామసభల ను సవ్యంగా నిర్వహించేందుకు తక్షణమే మండల స్థాయిలో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.అంతకుముందు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ,వార్డ్ సభలను పకడ్బందీగా నిర్వహించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఒకేలా ఉండేలా చూడాలని, జిల్లా మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు అందరిని గ్రామ సభలకు పిలవాలని, ప్రభుత్వం ద్వారా వివిధ పథకాల కింద లబ్ధి పొందిన లబ్ధిదారుల పేర్లన్నీ చదివి వినిపించాలని, ముఖ్యంగా రైతు భరోసా, ఉచిత విద్యుత్, సన్న బియ్యం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ జీవిత బీమా, పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకం వంటి వాటన్నిటిపై తెలియజేయాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆయా శాఖల సెక్రటరీలు, జిల్లా కలెక్టర్లు, అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, సిపిఓ శ్రీనివాస్ నాయక్, గృహ నిర్మాణ పిడి రాజ్ కుమార్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జెడ్పిసిఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

## అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన -- డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

### రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ సురక్షిత గమ్యాన్ని చేరుకోండి.

### జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్

**నల్గొండ జిల్లా మార్చి 31 నేటి వెలుగు ప్రతినిధి**

రోడ్డు ప్రమాదాల నివారణ మరియు ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమం భాగంగా కొండ మల్లేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా కొండమల్ల పల్లె పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రైవర్లకు ప్రత్యేకంగా ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించబడినవి. వాహనం నడిపే సమయంలో కంటి చూపు స్పష్టంగా ఉండటం అత్యంత ముఖ్యమని దృష్టిలో ఉంచుకొని ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో నిపుణులైన నేత్ర వైద్యులు డ్రైవర్ల కంటి చూపును పరీక్షించారు. దూరం మరియు సమీప చూపు (ఎఱంఋశీఅ ూవర్), కలర్ విజన్ పరీక్ష, కంటి ఒత్తిడి (జువవ ూాతీవంంబతీవ) పరీక్షలు నిర్వహించారు. రాత్రి సమయంలో వాహనం నడిపే డ్రైవర్లకు ప్రత్యేకంగా నైట్ విజన్ సమస్యలపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ మాట్లాడుతూ, "డ్రైవర్కు కంటి చూపు సరిగా లేకపోతే అది ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతుంది. ప్రతి డ్రైవర్ నిర్దిష్ట కాల వ్యవధిలో ఒకసారి అయినా కంటి పరీక్ష చేయించుకోవాలని అన్నారు.ఇది తన భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడే చర్య" అని పేర్కొన్నారు.ఈ ఉచిత నేత్ర పరీక్షల శిబిరానికి భారీ సంఖ్యలో ఆటో, లారీ, ట్రాక్టర్ మరియు ఇతర వాహనదారులు హాజరై పరీక్షలు చేయించుకున్నారు.రోడ్డు భద్రతలో భాగంగా భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.అలాగే రోడ్డు ప్రమాదాలు నివారణ గురించి మాట్లాడుతూ ముఖ్యంగా రోడ్డు భద్రత నియమాలను పైన అవగాహన లోపం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు.నిర్లక్ష్య డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం లేకపోవడం వంటి కారణాల వల్ల జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు.డ్రైవర్లు ప్రయాణానికి ముందు వాహనాల సాంకేతిక పరిస్థితిని తనిఖీ చేయాలని, అలసటతో లేదా నిద్రమత్తులో వాహనం నడపవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ ధరించాలి అని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు.అలాగే రోడ్డు ప్రమాదంలో ప్రమాదానికి గురైన వ్యక్తులను ప్రాథమిక చికిత్స నిమిత్తం తీసుకోవాల్సిన జాగ్రత్తలు డాక్టర్ల ద్వారా సీపీఆర్ పైన అవగాహనా కల్పించడం జరిగింది. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని,రోడ్డు వెంట ఉన్న ప్రతి గ్రామంలో రోడ్డు సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసి వారి సూచనలు సలహాల మేరకు రోడ్డు ప్రమాదాలు నివారణకు కృషి చేస్తున్నామని,"సురక్షిత ప్రయాణం సంతోషకర గమ్యం" అనే లక్ష్యంతో అందరూ కలిసి పనిచేయాలని జిల్లా ఎస్పీ గారు పిలుపునిచ్చారు.అనంతరం రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడుపుతూ ప్రమాదాల నివారణకు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో దేవరకొండ డిఎస్పీ శ్రీనివాసరావు, కొండ మల్లేపల్లి సీఐ నవీన్ కుమార్,ఎస్సై రమేష్, డిటిఅర్బి రిటైర్ సీఐ అంజయ్య,ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది,వైద్య బృందం, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు మరియు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ నియోజకవర్గ బీసీ గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటనపై విచారణ జరిపించాలి

### బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్

**మిర్యాలగూడ పట్టణం మార్చి 31 నేటి వెలుగు ప్రతినిధి**



నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం లోని శ్రీనివాస నగర్లో నిర్వహిస్తున్న దామరచర్ల మండల బీసీ బాలికల గురుకుల పాఠశాలలో రెండవసారి భోజనం పెట్టమని అడిగినందుకు విద్యార్థుల పట్ల వ్యవహరించిన సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకులాల కార్యదర్శి సైదులు గారికి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ ఎనిమిది మరియు తొమ్మిదవ తరగతికి చెందిన విద్యార్థులు రెండవసారి భోజనం అడిగితే వారిని అవమానకరంగా తిట్టడమే కాకుండా గంటసేపు మోకాళ్లపై నిలబెట్టినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దీనిని విచారించాలని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడవలసిన బాధ్యత విద్యాశాఖ అధికారులదేనని అన్నారు

## రోడ్డు మీద హీరోలా కాదు... బాధ్యతగల పౌరుడిలా నడవండి



**నల్గొండ మార్చి 31 నేటి వెలుగు ప్రతినిధి**

అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నల్గొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో నల్గొండ టూ టౌన్ ఎస్ఐ సైదులు స్వయంగా ముందుండి పాల్గొని ప్రజలు మరియు వాహనదారులను ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు నిర్లక్ష్యం, అతివేగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటివేనని తెలిపారు. ప్రతి వాహనదారు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా మైనర్లు వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడిపే వారు, వాహన పత్రాలు లేని వారు, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈరోజు మొత్తం 25 వాహనాలను సీజ్ చేయడం జరిగింది అలాగే కొన్ని వాహనాలకు జరిమానాలు విధించడం జరిగింది. నియమాలు ఉల్లంఘించిన వారికి చలానాలు విధించడంతో పాటు కౌన్సిలింగ్ నిర్వహించారు. మైనర్ల విషయంలో వారి తల్లిదండ్రులను పిలిపించి ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.మరొకసారి ఇలా దొరికితే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ సైదులు హెచ్చరించారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించి ప్రతి వాహనదారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించరాదని, వాహన పత్రాలు ఎల్లప్పుడూ సక్రమంగా కలిగి ఉండాలని తెలిపారు.



# నానో ఎరువులతో సుస్థిర వ్యవసాయానికి ప్రోత్సాహం: కలెక్టర్ చంద్రశేఖర్






**నల్గొండ మార్చి 31 నేటి వెలుగు ప్రతినిధి**

నానో ఎరువుల ద్వారా సుస్థిర వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన తిప్పర్తి మండలం, దుప్పలపల్లి రైతు వేదికలో వ్యవసాయ అధికారులకుద్దేశించి నానో ఎరువుల వినియోగం ద్వారా సుస్థిర వ్యయవసాయాన్ని ప్రోత్సహించడంపై నిర్వహించిన సాంకేతిక ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని ,డ్రోన్ సాంకేతికత ద్వారా నానో యూరియాను సమర్థవంతంగా ఉపయోగించి పంట దిగుబడులను పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2026 వానాకాలం సాగుకు రైతులను ముందునుండే సన్నద్ధం చేయాలన్నారు.రైతులు సన్న రకం వరి పండించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. వానకాలం సీజన్‌లో వ్యవసాయ యంత్రాల వినియోగాన్ని పెంచేందుకు ముందుగానే ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పంట మార్పిడి పద్ధతులను రైతులకు వివరించి వేరుశనగ, పెసలు మినుములు వంటి పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. అదేవిధంగా రైతులను ఉద్యాన పంటల వైపు మళ్లించి స్వీట్ ఆరెంజ్, మలబార్ వంటి అధిక ఆదాయం ఇచ్చే పంటలను సాగు చేయించాలన్నారు . రైతులు పత్తి సాగుపై దృష్టి పెట్టేలా చూడాలని, నకిలీ పత్తి విత్తనాలు కొని మోసపోకుండా ఒరిజినల్ విత్తనాలు మాత్రమే రైతులకు అందేలా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నకిలీ విత్తనాలు అమ్మే



వారిపై కేసులు నమోదు చేసి రైతులకు ఇబ్బందికలగకుండా చూడాలన్నారు. అలాగే జిల్లాకు కేటాయించిన సుమారు 10 వేల సాయిల్ హెల్త్ కార్డులు త్వరితగతిన రైతులకు అందజేయాలని, భూమి ఆరోగ్యాన్ని మెరుగుపరచే చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు సాంప్రదాయ పద్ధతులతో పాటు, ఆర్గానిక్ సాగు వైపు మళ్లి అధిక ఆదాయం పొందేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, జిల్లా ఉద్యాన శాఖ డిడి సుభాషిణి, తిప్పర్తి మండల ఏఈ ఓ సన్నీ రాజ్, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు .

## ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు ప్రజల వద్దకు తీసుకెళ్లాలి : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క





**సూర్యాపేట మార్చి 31 నేటి వెలుగు ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వం చేసేటువంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తెలియజేసి ప్రజలకు ఈ ప్రభుత్వం అనుసంధానంగా ఉంటూ ప్రజా ప్రభుత్వం పాలనందిస్తుందని ప్రజలకు తెలియ చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.మంగళవారం హైదరాబాద్ నుండి చీఫ్ సెక్రటరీ రామ కృష్ణా రావు, వైద్య, పంచాయతి రాజ్, మున్సిపల్, మైనింగ్ కార్యదర్శులతో ఏప్రిల్ 2వ తేదీన ప్రజాపాలన .. ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలు తెలియచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీకి వచ్చిన నిధులు వివరించి గ్రామాభివృద్ధికి ఉపయోగించుకునే వివరాలను తెలియచేయాలన్నారు. ప్రజాపాల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని తెలిపారు. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నామని, క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియచేయాలని తెలిపారు.ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు ప్రజల వద్దకు తీసుకెళ్లాలని. అలాగే ఇప్పటి వరకు చేసిన కార్యక్రమాలతో పాటు పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, ఇంటర్ విద్యార్థుల కు మధ్యాహ్న భోజనం గురించి గ్రామసభల్లో వివరించాలని తెలిపారు. గ్రామసభలకు విధి విధానాలు జారీ చేశామని ఆ ప్రకారం గ్రామ, వార్డు సభలకు ప్రజా ప్రతినిధుల ను ఆహ్వానించాలని తెలిపారు. గ్రామ సభ ప్రారంభానికి. ముందు రాష్ట్ర గీతం అలపించాలని, తదుపరి సీఎం సందేశం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు వినిపించాలని తెలి పారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్తు, వ్యవసాయ బోర్లు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, సన్న బియ్యం తదితర పథకాలపై లబ్దిదారులతో మాట్లాడించాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఉప ముఖ్యమంత్రి కు వివరిస్తూ గ్రామ సభల ద్వారా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి చేరే విధంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. గ్రామ, మున్సిపల్ వార్డు సభల స్పెషన్ ఆఫీసర్లు, ఇతర సీనియర్ అధికారులు గ్రామ పంచాయితీ లలో క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేస్తూ ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ పదకాలను ప్రజల్లోకి చేరే విధంగా ప్రత్యేక ప్రాణాళికతో ముందుకు పోతున్నట్లు వివరించారు. శాఖల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్దం చేసుకొని కొత్తగా ప్రవేశపెడుతున్నపథకలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన లబ్దిదారుల జాబితాను గ్రామ పంచాయితీలకు పంపించడం జరిగిందని ప్రజా ప్రతినిదుల సహకరంతో ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కే సీతారామారావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ సిఇఓ శిరీష, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, జిజిహెచ్ సూపర్డెంట్ శ్రవణ్ కుమార్ ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న అన్ని గ్రామాలు, మున్సిపాలిటీ వార్డుల్లో నిర్వహించే సభలకు ప్రజలు హాజరై విజయవంతం చేయాలి






**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి జిల్లా మార్చి 31 నేటి వెలుగు ప్రతినిధి**

గ్రామ సభలను సమయానుసారం నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలియజేశారు.ఏప్రిల్, 2న నిర్వహించబోయే గ్రామ సభలు, మున్సిపల్ వార్డుల్లో సభల నిర్వహణ విధి విధానాలపై మంగళవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొని పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి వాట్లడుతూ గ్రామ సభలు, మున్సిపల్ సభలు పండగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని, గ్రామ సభల్లో ప్రజలను, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పడ్డాక అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలు, లబ్ధిదారుల వివరాలు గ్రామ సభలో చదివి వినిపించాలని, అదేవిధంగా కొత్తగా అమలు చేయబోయే పథకాలు అందరికీ ప్రమాద భీమా , పాఠశాలల్లో అల్పాహార పథకం, జూనియర్ కళాశాల విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం వంటి పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్ర బడ్జెట్ నుండి గ్రామ పంచాయతీలకు ఇచ్చిన గ్రాంట్స్ వాటిని ఖర్చు చేసిన పనుల వివరాలు సభలో వివరించాలని సూచించారు.అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరే విధంగా చూడాల్సిన బాధ్యత కలెక్టర్ల పై ఉందన్నారు.జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ఏప్రిల్ 2 న గ్రామ, మున్సిపల్ సభలను పండగ వాతావరణములో సజావుగా నిర్వహించేందుకు ఇప్పటికే అధికారులకు బాధ్యతలు అప్పగించి తగిన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.ఆయా గ్రామాల్లో ఇచ్చిన రైతు భరోసా, రుణ మాఫీ, ధాన్యం సేకరణ, రైతులకు 500 రూపాయల బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పొందిన లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారు, 500 రూపాయలకే సిలిండర్, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు తదితర అన్ని వివరాలను గ్రామ పంచాయతీలకు పంపించినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధి పై ప్రజలు ఇచ్చే సలహాలు, సూచనలు సైతం స్వీకరించడం జరుగుతుందన్నారు. గ్రామ, మున్సిపల్ వార్డు సభలకు ప్రజలు అత్యధికంగా హాజరై తమ గ్రామ అభివృద్ధి పై అవగాహన ఏర్పరచుకోవడంతో పాటు తమ గ్రామ సమస్యలు ఉంటే చెప్పుకోవాలని కలెక్టర్ కోరారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, జడ్పీ సి. ఈ. ఒ యాదయ్య, సి.పి.ఓ హరికృష్ణ, డి.పి.ఓ రఘునాథ్ రెడ్డి , జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా సాయినాథ్ రెడ్డి, పాల్గొన్నారు.

## రేషన్ కార్డు దారులకు మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు జిల్లా మేనేజర్ ఎల్. సుగుణ బాయి

**మెడ్చల్-మల్కాజిగిరి జిల్లా మార్చి 31 నేటి వెలుగు ప్రతినిధి**



మెడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని రేషన్ కార్డు దారులకు మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు జిల్లా మేనేజర్ ఎల్. సుగుణ బాయి తెలిపారు.జిల్లాకు సంబంధించి 6,45,442 రేషన్ కార్డులలో నమోదైన 22,17,063 లబ్దిదారులకు, ఒక్కొక్కరికి నెలకు 6 కిలోల చొప్పున మూడు నెలలకు అవసరమైన మొత్తం 39,360,154 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.జిల్లాలోని 6 ఎంఎల్ఎస్ (మీూా) పాయింట్ల ద్వారా బియ్యాన్ని ఫెయిర్ ప్రైస్ షాపులకు సరఫరా చేసి, అక్కడి నుండి లబ్దిదారులకు సకాలంలో పంపిణీ చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టబడ్డాయి. లబ్దిదారులు ఏప్రిల్ 1వ తేదీ నుండి తమకు సంబంధించిన ఫెయిర్ ప్రైస్ షాపుల ద్వారా ఒకేసారి మూడు నెలల బియ్యాన్ని పొందవచ్చని తెలిపారు. రేషన్ కార్డు మరియు ఆధార్ వివరాలతో హాజరై బియ్యాన్ని సులభంగా పొందాలని సూచించారు.పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ చర్యలు అమలు చేయబడుతున్నాయి.అదేవిధంగా, ఎక్కడైనా అక్రమాలు, అదనపు వసూళ్లు లేదా ఇతర సమస్యలు తలెత్తిన పక్షంలో సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**